



# రంగస్థల నందీశ్వరుడు

**అదో రంగస్థలం. అక్కడో గోల్కొండ కోట. సింహద్వారానికి ఇరువైపులా ద్వారపాలకులు. కోటలోకి అడుగుపెడితే.. సైనికులు. వాళ్ల మధ్య పట్టు తలపాగా, ముత్యాల హారాలు, బంగారు ఆభరణాల్లో మురిసిపోతున్న మంత్రులు... ఎదురుగా సింహాసనంపై నవరత్న ఖచిత ఆభరణాల్లో వెలిగిపోతూ నవాబు.. గోల్కొండ గతవైభవం, రాచరిక పౌరుషం ఉట్టిపడేలా మేకప్ ఆర్టిస్ట్ బాపనిపల్లి పరమేశ్వర్ చేసిన కనికట్టు అది! అంగీలకు డబ్బుల్లేక పాలమూరు నుంచి పట్నం వచ్చిన పరమేశ్వర్ వస్త్రాలంకరణలో ఆరితేరాడు. తన మేకప్ కళతో నటులెందరినో నవరసాల్లో వెలిగించాడు. పాలమూరు చీకట్లను దాటి రంగుల కలలు కంటూ అయిదు నందులు గెలిచిన తెలంగాణ బిడ్డ బతుకుపయనమిది.**

అయిదెకరాల పొలం ఉన్నా.. ఆకలి బతుకులు మాయి. నేను ఏడో తరగతి చదువుతున్న రోజులవి. అప్పటికే రెండేండ్ల సంది కరువు. మా అమ్మానాన్నలు చన్నమ్మ, బక్కయ్య రెక్కలు ముక్కలు చేసుకొని పనిచేసినా పొట్టకే సరిపోతుండె. అంగీలు గిట్ల సరిగ్గ ఉండకపోవు. ఎండకాలం సెలవుల్లో కూలి కోసమని గండ్రావుపల్లి (నేటి నాగర్‌కర్నూల్ జిల్లా, పెద్దకొత్తపల్లి మండలం) నుంచి హైదరాబాద్ వచ్చిన. అట్ల 44 ఏండ్ల కిందట పట్నంల దిగిన. వారం రోజులు పని కోసం మస్తు తిరిగిన. రైల్వేస్టేషన్, బస్టాండ్, చౌరాస్తలల్ల పండుకున్న. చిన్నోడినని మేస్త్రీ పనికి తీసుకోలే. పిల్లల్ని షాపులల్ల పెట్టుకుంటరని బాగ్‌లింగంపల్లిలో ఉన్న 'ఆదర్శ డ్రెస్ ప్యాలెస్'లో అడిగితె..'నువ్వు చేస్తావో లేదో, నెల రోజులు చూస్తా' అన్నడు ఓనర్ తిరుమల శేషాచారి. బువ్వ పెట్టి చేయించుకున్నడు. నెల తర్వాత భోజనం పెట్టి నెలకు ముప్పయ్ రూపాయల జీతం ఇస్తన్నడు.

**ఊరి దారి.. బతుకు దారి**

నాకు పద్నాలుగేండ్లు వచ్చినయ్. 'అరె పిలగ.. పనితోపాటు సదువుండాలె. పది వరకన్నా సదవాలె' అని నలుగురు చెప్పేసరికి ఇంటికిపోవాల్ననే ఆలోచన వచ్చింది. మూడేండ్ల తర్వాత ఇంటికిపోయిన. నాగర్‌కర్నూల్ జాతీయ ఉన్నత పాఠశాలలో చేరిన. పదో తరగతి దాంక సదివిన. పది పరీక్షలు రాసిన. 'మళ్లీ రాగలవు' అని ఆదర్శ డ్రెస్ ప్యాలెస్ నుంచి ఉత్తరం అచ్చింది. మల్ల హైదరాబాద్ వచ్చిన. అక్కడ ఏడాదినర్ధం పనిచేసినంక, కేశవరామ్ గారి దగ్గర చేరిన. ఆయన మంచి ఆర్టిస్ట్. బొమ్మలు బాగా గీసేటోడు. అమ్మవారి బొమ్మలు, క్యాలెండర్‌లో కృష్ణుడి బొమ్మలు చూసి అట్ల మేకప్ చేయాల్నని పట్టుదలతో నేర్చుకున్న. 'మనం షాపుని శుభ్రంగా ఉంచుకుంటే ఇల్లు కూడా శుభ్రంగా ఉంటుంది' అని మా గురువు కేశవరామ్ గారు చెప్పేటోడు. ఆయన 'నాటకానికి దుస్తులు తీసుకుపోయి, తీసుకుని వచ్చేయ్' అని పంపేటోడు. నాకు తప్ప వేరేటోళ్లకు ఇచ్చేవాడు కాదు. షాప్ నుంచి ఏ మడతతో